www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 10 నవంబర్ 2023
5
పశ్చిమ గోదావరి

జాతీయ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి

భీమవరం జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

డిసెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని భీమవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్ అన్నారు. భీమవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఛాంబర్‌లో పోలీస్ అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ కోర్టులో పెండింగులో ఉన్న ఆయా పోలీస్ స్టేషన్లకు సంబంధించి రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులు, చెక్‌బౌన్స్ కేసుల రాజీకి చర్యలు తీసుకోవాలన్నారు. రాజీ కుదిరే కేసులను గుర్తించి బాధితులకు, ముద్దాయిలకు సమన్యాయం జరిగేలా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో భీమవరం రూరల్ సిఐ సత్యకిషోర్, ఎస్ఐలు బి.మోహన్‌రావు, బి.నాగబాబు పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరికి అపూర్వ ఆదరణ

జిల్లాలో ముగిసిన సిపిఎం బస్సు యాత్ర - సమస్యలు తెలుసుకుంటూ.. ప్రభుత్వ విధానాలను ఎండగట్టిన నేతలు - ప్రజాప్రణాళికపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - భీమవరం

అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రకు జిల్లాలో అపూర్వ ఆదరణ లభించింది. యాత్రకు ఎక్కడికక్కడే ప్రజానీకం స్వాగతం పలికి నీరాజనం పట్టారు. ముఖ్యంగా మహిళలు పెద్దసంఖ్యలో యాత్ర బృందానికి ఎదురెళ్లి తిలకం దిద్ది హారతులు పట్టారు. బైక్, సైకిల్ ర్యాలీలు, బాణాసంచా మోత, తీన్మార్ డప్పులు, కోలాటాల నడుమ యాత్రకు బ్రహ్మరథం పట్టారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను యాత్ర బృందానికి వివరించి వినతిపత్రాలు అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు పట్ల విసుగుచెందిన ప్రజానీకం సమస్యలను బృందానికి ఏకరువు పెట్టారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, మంతెన సీతారాం నేతృత్వంలో సాగిన ఈ బస్సు యాత్ర జిల్లాలో మూడు రోజులపాటు సాగింది. అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి ఈ నెల ఏడో తేదీ సాయంత్రం చించినాడ బ్రిడ్జి మీదుగా జిల్లాలోకి ప్రవేశించింది. అక్కడ నుంచి నరసాపురం, పాలకొల్లు, మార్టేరు, తణుకు, తాడేపల్లిగూడెం, కేశవరం మీదుగా జిల్లా కేంద్రం భీమవరం చేరుకుంది. అక్కడ నుంచి ఉండి, ఆకివీడు, ఏలూరు జిల్లా కలిదిండి మీదుగా కృష్ణా జిల్లాలోకి ప్రవేశించింది. జిల్లాలోని అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు అభిమానులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, స్కీమ్ వర్కర్లు, కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నాటి రోజుల్లో ప్రజాఉద్యమంలో భాగస్వాములైన సీనియర్ నేతలను రక్షణభేరి యాత్ర బృందం అభినందించి ఘనంగా సత్కరించింది. పది చోట్ల బహిరంగ సభలు జరిగాయి. యాత్ర బృందం సభ్యులు కె.లోకనాథం, మంతెన సీతారాం, కె.ధనలక్ష్మి, ఎవి.నాగేశ్వరరావు,

జిల్లాలో సాగిన ప్రజారక్షణ భేరి యాత్ర

కె.శ్రీనివాసరావు, ఎ.మాల్యాద్రి సభల్లో ప్రసంగించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకుల నిర్లక్ష్య ధోరణిని వివరించారు. రాష్ట్రానికి బిజెపి ద్రోహం చేస్తున్నప్పటికీ వైసిపి నోరు మెదపకపోవడం, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టిడిపి, ప్రశ్నిస్తానని చెప్పిన జనసేన బిజెపికి వత్తాసు ఎందుకు వత్తాసు పలుకుతున్నాయని నిలదీశారు. ఆశాలు, అంగన్వాడీలు, విఒఎలు, ఎపి సీడ్స్ మహిళలు, ఆటో యూనియన్ కార్మికులు, ఎల్ఐసి ఏజెంట్లు, పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, మెడికల్ రిప్రజెంటేటివ్స్ ఇలా అన్ని రంగాలకు చెందిన వారు వినతిపత్రాలు అందజేసి తమ సమస్యలను నేతలకు చెప్పుకున్నారు. రోజంతా కష్టపడినా రూ.500 కూడా రావట్లేదని, వృత్తిలో ప్రమాదం చోటుచేసుకుంటే ప్రాణాలు పోతున్నా పట్టించుకునే నాధుడే లేడని కొబ్బరి దింపు, వలుపు కార్మికులు వాపోయారు. అలాగే చేతివృత్తిదారులు, చేనేత, కల్లుగీత కార్మికులు తమ సమస్యలను బృందం దృష్టికి తీసుకొచ్చారు. నరసాపురంలో వశిష్ట వారధి నిర్మాణం, ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు, మత్స్యకారుల సమస్యలను బృందం దృష్టికి తీసుకొచ్చారు. పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన తణుకులో పరిశ్రమలు మూతపడ్డాయని, ముఖ్యంగా సుగర్ ఫ్యాక్టరీలు, స్పిన్నింగ్ మిల్లులు మూతపడటంతో సుమారు 35 వేల మంది కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడ్డారని విన్నవించారు. చెరకు సాగు అంతరించిపోయిందని, ఇతర అరటి, పూలు, జామ తదితర పంటలకు ప్రోత్సాహం కరువైందని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ జిల్లాలో వనరులు సమృద్ధిగా ఉన్నా అభివృద్ధిపై నిర్లక్ష్యం వహించడం దుర్మార్గమని మండిపడ్డారు. జిల్లాలో మూతబడిన పరిశ్రమలన్నీ తెరిపించాలని డిమాండ్ చేశారు. ప్రధాన పంటలుగా ఉన్న వరి, ఆక్వా సాగు సంక్షోభంలో ఉన్నాయని చెప్పారు. గోదావరి, సముద్ర తీరాలు, ఆయిల్, గ్యాస్ నిక్షేపాలు, సారవంతమైన నేలలు, సహజ సిద్ధ వనరులున్నా జిల్లా అభివృద్ధి మాత్రం ఆమడ దూరంలో ఉందన్నారు. నీటి వనరులు పూర్తిగా కలుషితమయ్యాయని, తాగేందుకు రక్షిత నీరు కరువైందని చెప్పారు. భీమవరం సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, తాడేపల్లిగూడెం సభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. సిపిఎం రూపొందించిన ప్రజాప్రణాళికపై రక్షణభేరి యాత్ర విస్తృత ప్రచారం నిర్వహించింది. భూమి లేని రైతులకు, పేద కుటుంబాలకు రెండు ఎకరాల భూమి ఇవ్వాలని, రూపాయికి విద్యుత్ యూనిట్, రూ.400కే గ్యాస్, ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, ఇల్లు, అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా సాగిన యాత్ర జిల్లాలో విజయవంతమైంది. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని యాత్ర బృందం భరోసానిచ్చింది.

వైద్య శాఖ అధికారితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

మాతా శిశుమరణాలు సంభవిస్తే కఠిన చర్యలు

జిల్లాలో ఇటీవల మరణాలపై విచారణకు ఆదేశం

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

మాతా శిశుమరణాల నివారణకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మరణాలు సంభవిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన మాతాశిశుమరణాలపై జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో సంభవించిన మాతాశిశుమరణాలపై సంబంధిత సిబ్బందిని కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది సరైన సమయంలో సాయం అందించడంలో అశ్రద్ధ కన్పిస్తుందన్నారు. గర్భం దాల్చిన నాటి నుండి, ప్రసవం కోసం ఆసుపత్రిలో చేర్పించడం, ప్రసవం అనంతరం తల్లీ బిడ్డలకు వైద్య సహాయం అందించే క్రమంలో ఏ విధమైన అలసత్వం వహించకూడదన్నారు. ఈ ఏడాది జులై నుండి సెప్టెంబర్ వరకు రెండో త్రైమాసికంలో నమోదైన మాతృ మరణాలకు హైపర్ టెన్షన్ ఒక కారణంగా ఉందన్నారు. ఎప్పటికప్పుడు బిపి వంటి బేసిక్ టెస్టులను నిర్వహించి వారికి మందులను అందజేయాలన్నారు. బిడ్డకు తల్లి పాలు ఎలా ఇవ్వాలి, ఇచ్చిన అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాలింతలకు ఐసిడిఎస్ సిబ్బంది ద్వారా అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తణుకు పట్టణంలోని బ్యాంకు కాలనీకి చెందిన ఆదిమూలం లక్ష్మీసాయిదుర్గ, నరసాపురం రూరల్ మండలం కొప్పర్రు గ్రామానికి చెందిన ఒడుగు దుర్గభవాని, అత్తిలికి చెందిన కిక్కర సునీత, పెంటపాడు మండలం ముదునూరు గ్రామానికి చెందిన పోతుమూరు శాంతిప్రియ, తాడేపల్లిగూడెం నరసింహారావుపేటకు చెందిన చింతాడ భారతి, మొగల్తూరు మండలం కెపిపాలెం సౌత్‌కు చెందిన అందే రాజరాజేశ్వరి ప్రసూతి మరణాలపై విచారణ జరిపి, సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. కిక్కిర సునీత మరణంపై అత్తిలి పిహెచ్‌సి ఎఎన్ఎంకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు, డిఐఒ, నోడల్ అధికారి డాక్టర్ దేవ సుధాలక్ష్మి, సభ్యులు డిసిహెచ్ఎస్ డాక్టర్ సూర్యనారాయణ, గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవికళ్యాణి, పీడియాట్రిక్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎనస్థియన్ డాక్టర్ స్వర్ణకుమారి, ఫిజీషియన్ డాక్టర్ జి.పద్మ, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతరాణి, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ వర ప్రసాద్, పొగిసి రిప్రజెంటేటివ్ డాక్టర్ ఎన్.నరసవాణి, 108 వాహనాల జిల్లా కోఆర్డినేటర్ ప్రకాష్‌బాబు, వివిధ ప్రయివేట్ హాస్పిటల్స్ డాక్టర్లు పాల్గొన్నారు.

ఆత్మ నిర్భర్ పేరుతో దేశానికి బిజెపి ద్రోహం

కానరాని మేకిన్ ఇండియా

ప్రభుత్వరంగ సంస్థలన్నీ కార్పొరేట్లకు దారాదత్తం

ప్రజారక్షణభేరి యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి - ఆకివీడు

ఆత్మ నిర్భర్ పేరుతో దేశానికి బిజెపి ద్రోహం చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం విమర్శించారు. దేశభక్తి అంటూ భారతీయుల వ్యక్తిత్వాన్ని, ఆంతరాత్మను మోడీ అమెరికాకు తాకట్టుపెడుతున్నారని ఆరోపించారు. ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర గురువారం ఆకివీడు చేరింది. ఈ యాత్రకు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సిపిఎం నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. అక్కడి నుండి జాతీయ రహదారి గుండా సుమారు మూడు కిలోమీటర్లు సాగి పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద మహిళలు యాత్రలోని నేతలకు హారతులిచ్చి పూలు జల్లి ఘనస్వాగతం పలికారు. యాత్ర రథసారధి లోకనాథం, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు, కె.ధనలక్ష్మి, హరిబాబు, కె.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి బి.బలరాం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుండి దొరగారి చెరువు వద్ద బహిరంగ సభ ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. సభా వేదిక వద్ద పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు

ఆకివీడులో నేతల అభివాదం

నేతలకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభకు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షత వహించగా లోకనాథం మాట్లాడుతూ మోడీ మేకిన్ ఇండియా అంటూ ఉన్న ఉద్యోగాలకు ఎసరు పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపి మోడీకి దాసోహమంటున్నాయన్నారు. నిరుద్యోగ యువతకు ఆసరాగా ఉంటానంటూ వచ్చిన జనసేన పవన్ కళ్యాణ్ సైతం వాటి గురించి ప్రశ్నించకపోవడం విడ్డూరమన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.ధనలక్ష్మి మాట్లాడుతూ శ్రామిక మహిళల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 35 వేల మంది మహిళలు అదృశ్యమవ్వగా వారిలో ఏడు వేల మంది బాలికలు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల అక్రమ రవాణాను అడ్డుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మద్యనిషేధం అమలు చేస్తానన్న ముఖ్యమంత్రి నేడు తన బ్రాండ్లు మాత్రమే తాగాలని, ఇతర బ్రాండ్లు తాగితే తాను ఒప్పుకోనని అంటున్నారని వ్యాఖ్యానించారు. 30 అంశాలతో సిపిఎం ప్రజాప్రణాళికను ప్రజల ముందు ఉంచామన్నారు. జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ప్రజాప్రణాళికకు మద్దతిచ్చి ఈ నెల 15న విజయవాడలో జరగనున్న ప్రజారక్షణ భేరి సభకు ప్రతిఒక్కరూ తరలిరావాలని కోరారు.

ఉండిలో వినతి అందిస్తున్న హమాలీలు

సీనియర్ నేతకు సత్కారం

సిపిఎం సీనియర్ నేత బొక్కా సత్యనారాయణకు సత్కారం

సీనియర్ నేత, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొక్కా సత్యనారాయణను రాష్ట్ర నేతలు లోకనాథం, ఎవి.నాగేశ్వరరావు సత్కరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.కళ్యాణి, నేతలు ధనికొండ శ్రీనివాస్, గొర్ల రామకృష్ణ పాల్గొన్నారు.

ఉండి: తాము అధికారంలోకి వస్తే సామాన్యులకు పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చిన నరేంద్ర మోడీ అధికారం చేపట్టిన నాటి నుంచి సామాన్యుల నడ్డి విరుస్తూ కార్పొరేట్లకు పట్టంగడుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం విమర్శించారు. గురువారం ఉండి మెయిన్ సెంటర్‌కు చేరుకున్న సిపిఎం ప్రజా రక్షణ భేరి యాత్రకు ఆ పార్టీ మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ నేతృత్వంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లోకనాథం, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ నియంత పాలన సాగిస్తున్నారన్నారు. బిజెపికి రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన వత్తాసు పలకడం దౌర్భాగ్యమన్నారు. బిజెపికి ప్రత్యామ్నాయం సిపిఎంతోనే సాధ్యమన్నారు. జాతీయ రహదారి 165లో ఉన్న ఉండి ఆర్ఒబి నిర్మాణం మూడున్నరేళ్ల క్రితం ప్రారంభించినప్పటికీ నేటికీ పూర్తిస్థాయిలో పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే ఆర్ఒబి నిర్మాణాన్ని పూర్తిచేయాలని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ బేవరేజస్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్ర నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి, నేతలు జెఎన్‌వి.గోపాలన్, మండల నాయకులు మాదాసి గోపీ, రామకూరి వెంకటరత్నం, చీర్ల శేషు, వీరవల్లి మాధవరావు, వీరవల్లి శ్రీనివాస్, కొట్టాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం నిర్దేశించిన అంశాల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో మూడో దశ రీసర్వే స్టోన్ ప్లాంటేషన్, బిహెచ్‌పిఎస్ డిస్ట్రిబ్యూషన్, ఎలక్షన్లు, ఎసైన్డ్ భూములు, సివిల్ సప్లయిస్, అడంగల్ కరెక్షన్స్, జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు, స్థల సేకరణ, టూరిజం ప్రాజెక్ట్స్, స్పందన గ్రీవెన్స్, మీసేవ బియోండ్ ఎస్ఎల్ఎ, వాటర్ ట్యాక్స్, ఒటిసి, సిసిఆర్‌సి కార్డులు, ఒటిఎస్ రిజిస్ట్రేషన్, పిఎం కిసాన్, కోర్టు కేసులు తదితర 20 అంశాలపై మండలాలవారీగా సంబంధిత డివిజన్, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. మూడో దశ రీసర్వేలో 20 మండలాల్లో 104 గ్రామాలు త్వరితగతిన రీసర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. పకడ్బందీగా మూడో దశ రీసర్వే ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని, అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని

మాట్లాడుతున్న జెసి రామ్‌సుందర్‌రెడ్డి

అన్నారు. సాధారణ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. డిఆర్ఒ కృష్ణవేణి, ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, గ్రామ, వార్డు సచివాయాల జిల్లా అధికారి, ఇన్‌ఛార్జి డిసిఒ కెసిహెచ్.అప్పారావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, డిఎస్ఒ ఎన్.సరోజ, జిల్లా హార్టికల్చర్ అధికారి ఎ.దుర్గేష్, జిల్లా కలెక్టర్ కార్యాలయ ఎఒ వైకెవి.అప్పారావు, ఎఎస్ఒ ఎం.రవిశంకర్, జిల్లా కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సిహెచ్.రవికుమార్, భీమవరం తహశీల్దార్ వై.రవికుమార్, పాలకోడేరు తహశీల్దార్ షేక్ హుస్సేన్, మెజిస్టీరియల్ సూపర్‌వైజర్ ఆర్.రాంబాబు, డిప్యూటీ తహశీల్దారు ఇ.నాగార్జున పాల్గొన్నారు.

నేడు మొగల్తూరులో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి - మొగల్తూరు

జగనన్నకు చెబుదాం - స్పందన మండలస్థాయి కార్యక్రమం శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఉండ్రు బాబ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలపై అర్జీలు అందించాలని సూచించారు.

సాంకేతికతను జోడిస్తే మంచి దిగుబడులు

ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ జగపతిరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

వ్యవసాయ రంగంలో సాంకేతికతను జోడిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని, నూతన రకాల వంగడాలు కూడా పండించవచ్చునని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. మోగల్లు గ్రామంలో తన వ్యవసాయ క్షేత్రంలో వినూత్నంగా పూసా బాస్మతి 1692 రకం సాగు చేశారు. పది ఎకరాల విస్తీర్ణంలో చక్కగా పండింది. దీనిని స్వయంగా పరిశీలించేందుకు రైతు కార్యాచరణ సమితి నాయకులు, భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు, పాలకోడేరు మండల వ్యవసాయ శాఖ అధికారుల బృందం స్వయంగా విచ్చేశారు. ఈ సందర్భంగా జగపతిరాజు తాను చేసిన సాగు వివరాలు, తక్కువ ఎరువులు ఉపయోగించి ఏవిధంగా సాగు చేసింది వివరించారు. ఈ సందర్భంగా రైతు కార్యాచరణ సమితి నాయకులు పాతపాటి మురళీరామరాజు, సత్యనారాయణరాజు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.కృష్ణచైతన్య, పాలకోడేరు మండల వ్యవసాయాధికారి నారాయణరావు, జగపతిరాజు అభినందించారు.



పొలం చూపుతున్న జగపతిరాజు

ఎపి నిట్‌ను సందర్శించిన తైవాన్ ప్రొఫెసర్లు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎపి నిట్)ని తైవాన్‌లోని నేషనల్ సన్ యెట్‌సు యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు డాక్టర్ హెచ్‌డి.యాంగ్, డాక్టర్ కాకర్ల దేవి చంద్రశేఖర్ గురువారం సందర్శించారు. ఇండియా-తైవాన్ సహకార ప్రాజెక్టులో భాగంగా ఎపి నిట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.కృష్ణమూర్తి రూ.78 లక్షల విలువైన ప్రాజెక్టును దక్కించుకుని గతేడాది తైవాన్ యూనివర్సిటీకి వెళ్లారు. ఈ ఏడాది తైవాన్ ప్రొఫెసర్లు ఇక్కడకు వచ్చారు. నిట్ ప్రాంగణంలోని ప్రయోగశాలలు, భవనాలను పరిశీలించి బాగున్నాయని కితాబిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో యాంగ్ మాట్లాడుతూ సూపర్ కండక్టవిటీ ఎలా అభివృద్ధి చెందింది, విద్యుత్ శక్తిని ఎటువంటి అంతరాయం లేకుండా ఒకచోట నుంచి మరొక చోటుకు ఎలా సరఫరా చేయాలి, ఎలక్ట్రిక్ వాహనాల ఉపయోగం, వాటి ప్రాధాన్యత గురించి వివరించారు. ప్రొఫెసర్ కాకర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎపి నిట్, ఎన్ఎస్‌వైఎస్ యూనివర్సిటీల సత్సంబంధాలు, ఇండో-తైవాన్ ప్రాజెక్టులో భాగంగా ఈ రెండు విద్యాసంస్థలు భవిష్యత్తులో చేపట్టబోయే ప్రణాళికల గురించి వివరించారు. తమ దేశంలో ఉన్నత విద్యకు సంబంధించిన వివరాలు, ఉద్యోగావకాశాలు ఎలా ఉన్నాయి, వాటికి దరఖాస్తు చేసుకునే విధానాల గురించి విద్యార్థులకు వివరించారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ తాను చేస్తున్న ప్రాజెక్టు ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి, డాక్టర్ టి.కురుమయ్య, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ తపస్, డాక్టర్ రాముడు, డాక్టర్ సుదర్శన్ ధ్రువ, డాక్టర్ అమరేంద్ర, డాక్టర్ శరత్‌ద్వివేది, డాక్టర్ సురేంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తైవాన్ ప్రొఫెసర్

ఘనంగా ఉండి కెవికె వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - ఉండి

ఉండి కెవికె వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు గురువారం కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, గోదావరి మండల సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎం.భరతలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1995 నవంబర్ 9న ఉండి పరిసర ప్రాంతాల్లోని వరి రైతులకు వ్యవసాయంలోని మెళకువలు, సలహాలు, సూచనలు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడిని ఏ విధంగా పొందవచ్చని తెలియజేసేందుకు కృషివిజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. నాటి నుండి నేటి వరకు వరి రైతులకు, ఆక్వా రైతులకు, చిరుధాన్యాల ఉత్పత్తిదారులకు ఎంతోమందికి సలహాలు సూచనలిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సహకరించామన్నారు. అనంతరం సేంద్రియ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తిదారులు వినియోగదారులు, వ్యాపారవేత్తల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్.దెబోరా మెస్సియానా, డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.రాజేష్, డాక్టర్ పి.వినయలక్ష్మి, బి.రజిత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్ వెంకటేశ్వరరావు

ఈ రోడ్లతో అవస్థలు ఇంకెన్నాళ్లు

సిపిఎం ఆగ్రహం

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్లపై ఇంకెన్నాళ్లు రాకపోకలు సాగించాలని సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నవుడూరులోని సిపిఎం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్అండ్‌బి అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. నవుడూరు సెంటర్ నుండి మడుగుపోలవరంలంక వరకు ఉన్న ఆర్అండ్‌బి రోడ్డుకు నిధుల కేటాయింపు ఉందా, లేదా అని ప్రశ్నించారు. అసలు ఈ రోడ్డుకు నిధులు కేటాయిస్తారా, లేదా అనేది ప్రభుత్వం ఆర్అండ్‌బి అధికారులు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ రహదారిపై ప్రయాణమంటేనే వాహనదారులు, ప్రయాణికులు హడలెత్తే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. చెరువులను తలపించేలా ఈ రోడ్డుపై గుంతలు ప్రజల పాలిట శాపంగా మారాయన్నారు. ఈ రోడ్లు పరిస్థితిపై 2020 నుండి ఇప్పటి వరకు పాదయాత్రలు, నిరసన దీక్షలు, ధర్నాలు, రెండుసార్లు కలెక్టరేట్‌కు మోటార్ సైకిల్ యాత్రలు నిర్వహించామన్నారు. స్పందనలో ఫిర్యాదు అందించి కనీసం ఏదైనా స్పెషల్ గ్రాంటు నిధులతోనైనా గోతులైనా పూడ్చమని అభ్యర్థించినప్పటికీ అధికారుల నుంచి స్పందన కరువైందన్నారు. వాహనదారులు గుంతల్లో పడిపోవడం, ఎండా కాలంలో దుమ్ముధూళి వంటి పరిణామాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరవాసరం-నవుడూరు, పంజావేమవరం-రాయకుదురు రోడ్ల అభివృద్ధికి టెండర్లు పిలిచామని అధికారులు చెప్పినా పనులు ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రశ్నించారు. రామేశ్వరం-కవిటం వయా కొణితివాడ, మడుగుపోలవరం రోడ్డుకు రూ.15 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్న అధికారులు దానిపై స్పష్టత ఇవ్వాలన్నారు. కొణితివాడ కాలువ వద్ద ఉన్న మద్యం దుకాణం వద్ద మందుబాబుల హడావుడితో ఈ ప్రాంతం గుండా ప్రయాణమంటేనే ప్రజలు వెనుకాడే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా రోడ్ల పరిస్థితిపై అధికారులు, పాలకులు స్పందించకపోతే కలిసొచ్చే పార్టీలు, సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అఖిలపక్షం నిర్వహించి పోరాటం ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నేతలు యాళ్లబండి నారాయణమూర్తి, బళ్ల చినవీరభద్రరావు, కిలాడి సత్యనారాయణ, జుత్తిగ శ్రీనివాస్, గిద్దా శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

రంగరాజు కథకు రాష్ట్రస్థాయి బహుమతి

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని చెరుకువాడకు చెందిన సాహితీవేత్త, విశ్రాంత ఉపాధ్యాయుడు, లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ గాదిరాజు రంగారాజుకు మరో రాష్ట్రస్థాయి బహుమతి లభించింది. వివరాలను గురువారం ఆయన విలేకరులకు తెలిపారు. సుమతి పత్రిక నిర్వహించిన దసరా కథల పోటీల్లో ప్రథమ బహుమతి పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజయదుర్గ సంస్థ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు రంగరాజును అభినందించారు. రంగరాజు రచించిన వ్యామోహం కథకు ఈ బహుమతి లభించింది. ఇటీవల రంగరాజు గీసిన కార్టూన్‌కు రాష్ట్రస్థాయి బహుమతిని నెల్లూరులో అందుకున్నారు. రంగరాజును ఉండి మండల అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు (హరిబాబు), ప్రముఖ పారిశ్రామిక వేత్త డాక్టర్ పి.శేఖర్‌రాజు, ముదునూరి శివరామరాజు, శ్రీధర్, గోపాలరాజు, ఆంజనేయులు, సుబ్బరాజు తదితరులు అభినందించారు.

ఫార్మసీ రంగం అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక ది భీమవరం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నడుపుతున్న కెజిఆర్ఎల్ ఫార్మశీ కళాశాలలో గురువారం మొదటి ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ 'కరెంట్ అండ్ ఫ్యూచర్ ప్రాస్పెక్ట్స్ ఆఫ్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెలివరీ అప్రోచ్చస్' అంశంపై సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ పి.శైలజ అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఆంధ్ర యూనివర్సిటీ విశాఖపట్నం, డాక్టర్ జి.శ్రీధర్‌బాబు. ప్రిన్సిపల్ ఆఫ్ శివానీ కాలేజ్ ఆఫ్ ఫార్మశీ వరంగల్, డి.నరేందర్ రెడ్డి ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఆఫ్ గ్లాకోస్ కార్పొరేషన్ సిఎ యూఎస్ఏ హాజరై మాట్లాడారు. ఫార్మశీ రంగాన్ని ఏవిధంగా ఇంకా అభివృద్ధి పథంలో నడిపించవచ్చో వివరించారు. కెజిఆర్ఎల్ ఫార్మశీ డైరెక్టర్ కవల నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ డి.రాఘవ వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి గుణపాఠం చెప్పండి

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - ఉండి

ఎస్‌సిలను మోసం చేస్తూ ఎస్‌సి కార్పొరేషన్ నిధులను పక్కదారి పట్టిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. గురువారం ఉండి నక్కరాజుగుంట గోరింతోట ప్రాంతాల్లో మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి అధ్యక్షతన నిర్వహించిన ఇంటింటికీ టిడిపి మన బాబు కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కేవలం టిడిపితోనే సాధ్యమన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎస్‌సి కార్పొరేషన్ నిధులు పక్కదారి పట్టిస్తూ ఎస్‌సిల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జిలు గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, కట్టా రాంబాబు, నాయకులు గొల్ల విక్టర్‌బాబు, ఉండ్రు ఇస్సాకు, కిన్నెర వెంకన్న, పెద్దింటి నాగలక్ష్మి, కర్రి ధనలక్ష్మి పాల్గొన్నారు.

పెదఅమిరంలో డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న సర్పంచి సోమేశ్వరరావు

డ్రెయినేజీ సమస్యకు మోక్షం

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరంలో ఎన్నో ఏళ్ల నుంచి పరిష్కారానికి నోచుకోని డ్రెయినేజీ సమస్యకు సిమెంట్ డ్రెయినేజీ నిర్మాణంతో మోక్షం లభించింది. చిన్న వీధుల వల్ల వర్షం పడితే రోడ్లపై మురుగునీరు చేరి స్థానికులు నడవడానికి కూడా అవస్థలు పడేవారు. గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు చొరవతో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను పంచాయతీ నిధులు రూ.1.50 లక్షలతో పనులు జరుగుతున్నాయి. మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

15 నుంచి టెన్నిస్ పోటీలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

కొవ్వలి ఎఐఎస్‌టిఎ నరసాపురం 2023 ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలను ఈ నెల 15వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ నిర్వహించనున్నామని టోర్నమెంట్ ఆర్గనైజర్ కానూరి బుజ్జి అన్నారు. నరసాపురం, మొగల్తూరు రోడ్డు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న పోలిశెట్టి సీతారామయ్య టెన్నిస్ కోర్టులో టోర్నమెంట్ పోటీలు జరుగుతాయని బుజ్జి తెలిపారు. ఇవే పోటీలు పాలకొల్లు కాస్మో పోలిటెన్ క్లబ్ టౌన్ హాల్లో కూడా నిర్వహిస్తామన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలకు ప్రధానదాతగా వ్యవహరిస్తున్నారన్నారు. విజేతలకు రూ.4 లక్షల నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ప్రముఖ టెన్నిస్ క్రీడాకారులు ఎన్‌వి.రావు, చక్రవధానుల చిన రెడ్డప్ప ధవేజీ తదితరులు అసోసియేషన్ అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పోలిశెట్టి నందకుమార్, జక్కంపూడి సత్యనారాయణ, పిఆర్.రాయుడు, పితల రమేష్ బాబు, కటకం శెట్టి నారాయణరావు, కంద్రేగుల సత్యనారాయణ, ఎన్.శ్రీనివాసరాజు, జానుపాముల అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే వేధింపులు

బాధితుడు సురేష్‌బాబు ఆవేదన

ప్రజాశక్తి - మొగల్తూరు

రాజకీయ కక్షతోనే సర్పంచి భర్త, సచివాలయ సిబ్బంది తమను ఇబ్బందులు గురి చేస్తున్నారని నిప్పులేటి సురేష్ బాబు, అతని తండ్రి శ్రీరామ్మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో గురువారం బాధిత కుటుంబ సభ్యులు విలేకరులతో మాట్లాడారు. తాము గ్రామంలో కొనుగోలు చేసిన గ్రామ కంఠం భూమిని పంచాయతీ వారు స్వాధీనం చేసుకున్నారని, న్యాయస్థానాన్ని ఆశ్రయించామని తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని తెలిపారు. గ్రామంలో డ్రెయినేజీ పేరుతో తాము కొనుగోలు చేసిన స్థలం ఫెన్సింగ్‌ను దౌర్జన్యంగా తొలగించి తమ స్థలం ముందు కాలువను తలపించేలా కచ్చాడ్రెయిన్ తవ్వి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో తాము వైసిపి బలపర్చిన వారికి మద్దతు ఇవ్వనందున సర్పంచి భర్త కక్ష సాధింపులకు పాల్పడ్డారని తెలిపారు.

మామూళ్ల పండగే..!

బాణాసంచా షాపుల వద్ద నిబంధనలు నిల్

అధికారుల వసూళ్ల పరంపర

అధిక ధరలతో సామాన్యుల జేబుకు చిల్లు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

దీపావళి వచ్చిందంటే అగ్నిమాపక, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారుల పండగలా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీపావళి పేరుకు పెద్ద పండుగ అయినప్పటికీ మందుగుండు సామగ్రి వినియోగించిన వ్యక్తుల ప్రాణాలతో చెలగాటం ఆడినట్లే. ఇదే అదునుగా చేసుకుని అధికారులు షాపుల నిర్వహణ దగ్గర పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారని వ్యాపారులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. స్థానిక లూథరన్ హైస్కూల్ గ్రౌండ్‌లో సుమారు 40 మందుగుండు షాపులు ఏర్పాటు చేసినా ఆయా షాపులకు ప్రభుత్వం విధించిన నిబంధనలు మచ్చుకైనా కానరావడం లేదు. మందుగుండు సామగ్రి నిల్వల నుంచి విక్రయాల వరకూ అడుగడుగునా నిబంధనలకు నీళ్లు వదులుతూనే ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు ధరల నియంత్రణ పట్టికల ఊసే లేదు. ఏ వస్తువు ఎంత రేటుకు అమ్మాలనేది ఇక్కడ కనిపించదు. ఈ పరిస్థితుల్లో సామాన్యుడు దీపావళి పండుగ చేసుకోవాలంటే హడలిపోతున్నాడు. బాణాసంచా ధరలను వ్యాపారులు ఏటా 20 శాతం పెంచేస్తుండడంతో సామాన్యుల జేబులకు చిల్లులు పడుతున్నాయి.

భీమవరంలో లూథరన్‌హై స్కూల్ సమీపంలో భారీస్థాయిలో ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాలు

జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, ఆకివీడు తదితర ప్రాంతాల్లో బాణాసంచా హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి. ఎక్కువగా విక్రయాలు జరిగే తాళ్లు, బూచక్రాలు, విష్ణు చక్రాలు, కాకరపూవ్వొత్తులు, చిచ్చుబుడ్లు వంటి సాధారణ టపాసుల ధరలు గతేడాది కన్నా ప్రస్తుతం 20 శాతం పెంచేశారు. శాశ్వత, తాత్కాలిక అనుమతులు పొందిన వారు కూడా శాఖల వారీగా మామూళ్లు ఇవ్వాల్సి వస్తుందని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక లైసెన్సుల కోసమే దుకాణానికి వచ్చి, దుకాణం ఏర్పాటు చేసే ప్రాంతాన్ని బట్టి రూ.20 నుంచి రూ.50 వేల వరకూ ఖర్చు చేయాల్సి వస్తోంది. పలు గ్రామాల్లో ఐదు నుంచి ఆరు దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో లైసెన్సులపేరుతోనే చిరు వ్యాపారులు రూ.లక్షల ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఈ ఏడాది వ్యాపారం బాగుంటుందని ప్రచారం జరగడంతో కొందరు అధికారులు అధికంగా ముడుపులు డిమాండ్ చేస్తున్నారని వ్యాపారులు వాపోతున్నారు. ఈ దుకాణాల ఏర్పాటు కోసం మామూళ్ల రూపంలో రూ.లక్షల్లో వసూలు చేశారనే విమర్శలు వనిపిస్తున్నాయి. షాపుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని ఇటీవల సమావేశపర్చారు. ఎంత మంది విక్రయాలు చేయాలనుకుంటున్నారో, దుకాణాలు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో వివరాలు ఇవ్వాలంటూ సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో వారంతా భారీస్థాయిలో ముడుపులు చెల్లించుకోవాల్సి వచ్చింది. ఇతరత్రా శాఖలతో తమకు సంబంధం లేదని, తమకు ఇవ్వాల్సినంత కచ్చితంగా ఇవ్వాలని అంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మందుగుండు సామగ్రి తీసుకురావడానికి వ్యాపారులు రెండు రకాల పన్నులు చెల్లించాలి. హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, పురపాలక, పంచాయతీ తదితర శాఖల అనుమతులు తీసుకోవాలి. దీనికి లైసెన్స్ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఇంత వరకూ బాగానే ఉన్నా. అనధికారిక ముడుపులతో తమకు వ్యాపారం జరగకపోతే తీవ్రంగా నష్టపోతామని వాపోతున్నారు. పట్టణాలు, మున్సిపాల్టీల పరిధిలో భారీస్థాయిలో మందుగుండు సామగ్రి విక్రయాలు జరుగుతాయి. జిల్లా కేంద్రంలో, ఇతర ముఖ్య పట్టణ ప్రాంతాల్లో వ్యాపారులంతా ఈ ఏడాది కేవలం ముడుపుల కోసం ఒక్కో చోటే రూ.10 నుంచి రూ.15 లక్షల వరకూ కేటాయించినట్లు సమాచారం. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం పట్టణాల్లోనే దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది.

'రాష్ట్రానికి జగన్ ఎందుకు అవసరం'పై అవగాహన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం తాడేపల్లిగూడెంలో మంత్రి కొట్టు ప్రారంభించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెంలో 2019 జూన్ నుంచి 2023 జూన్ వరకూ చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు జగనన్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలను స్థానిక యాగాలపల్లి వద్ద సెకండ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి సెంటర్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిలాఫలకాన్ని మంత్రి కొట్టు ఆవిష్కరించారు. ఆర్‌డిఒ కె.చెన్నయ్య పుష్పగుచ్ఛంతో మంత్రిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ మాయ, మోసం, దగా, పచ్చి అబద్ధాలకు మారుపేరైన చంద్రబాబును జనం విశ్వసించడం లేదన్నారు. నాలుగున్నరేళ్లుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శామ్యూల్, కొలుకూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మొగల్తూరు: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మొగల్తూరు పంచాయతీ పరిధి పడమటిపాలెం సచివాలయ ఆవరణలో గురువారం సాయంత్రం వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డు ఆవిష్కరించినట్లు తెలిపారు. పథకాల అమల్లో నూరుశాతం పారదర్శకత పాటిస్తున్నామని, ఓట్ల కోసం కాదు అభివృద్ధి కోసం పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, జెడ్‌పిటిసి తిరుమాని బాబ్జి వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు అండ్రాజు చల్లారావు, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు కొల్లాబత్తుల రవికుమార్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉండి : 'రాష్ట్రానికి జగన్ ఎందుకు అవసరం' కార్యక్రమంలో భాగంగా ఉండి గాంధీనగర్ వీధిలో వైసిపి నాయకులు గురువారం సాయంత్రం ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉండి గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందించడమే కాకుండా గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని వెంటనే వాటికి పరిష్కారం చూపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం పూర్తయిన వెంటనే సచివాలయ అభివృద్ధికి రూ.20 లక్షలు కేటాయించి అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో చేయడం జరుగుతుందని తెలిపారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తున్న విషయం ప్రతి ఒక్కరూ గమనించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ, మండల అధ్యక్షులు పెన్మత్స ఆంజనేయరాజు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడిద వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

ఉండి: రాష్ట్రానికి జగన్ ఎందుకు అవసరం కార్యక్రమంలో పాల్గొన్న వైసిపి నేతలు

వీరవాసరం : గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రిగా జగన్ గుర్తింపు పొందారని, అందుకే మరోసారి రాష్ట్రానికి జగన్ ముఖ్యమంత్రి కావాలని లబ్ధిదారులు తెలిపారు. ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం గురువారం నందమూరి గరువులో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, ఎంపిడిఒ జ్యోతి పాల్గొన్నారు.

ఆచంట : 'రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో భాగంగా ఆచంట గ్రామ సచివాలయం వద్ద ఆచంట గ్రామ సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావుచే గ్రామ సచివాలయ కార్యాలయం వద్ద మా నమ్మకం నువ్వే జగన్ డిజిటల్ బోర్డు ప్రారంభోత్సవం, జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ చిల్లే లావణ్య, వైసిపి మండల కన్వీనర్ జక్కంశెట్టి చంటి, సర్పంచి, సచివాలయ మండల కన్వీనర్ తమరాడ చంద్రశేఖర్, మండల బూత్ కన్వీనర్ కుక్కలా కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : రుస్తుంబాధ గ్రామ సచివాలయం వద్ద వైసిపి జగన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అర్హులకు చేయూతనివ్వాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతి గ్రామంలోనూ ప్రభుత్వ అధికారులను నియమించి ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంబిసి ఛైర్మన్ పెండ్ర వీరన్న జెడ్‌పిటిసి బి.రాధాకృష్ణ, ఎంపిపి పాల్గొన్నారు.

పెనుమంట్ర: మన గ్రామానికి జగన్ సంక్షేమ పథకాలు అందించారో ప్రజలకు తెలుసుకోవాలనే ఉద్దేశంతో సంక్షేమ పథకాల సమాచార బోర్డును ఆవిష్కరించినట్లు ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి) అన్నారు. గురువారం పొలమూరు సచివాలయం వద్ద సర్పంచి కాకర రాజేశ్వరరావు అధ్యక్షతన జగన్ సంక్షేమ పథకాల సమాచార బోర్డును ఎంపిపి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట నారాయణ మాట్లాడుతూ గ్రామానికి 38 సంక్షేమ పథకాలకు రూ.25.95 కోట్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచి కలిదిండి దినేష్‌రాజు, వైఎస్ ఎంపిపి వాసంశెట్టి కిరణ్, వైసిపి మండల కన్వీనర్ గూడూరి దేవేంద్రుడు, వ్యవసాయ మండల కమిటీ ఛైర్మన్ కొవ్వూరి చిన్నారెడ్డి పాల్గొన్నారు.

పెనుగొండ : మండలంలో రాష్ట్రానికి జగనన్న ఎందుకు కావాలని కార్యక్రమంలో భాగంగా వైసిపి నేతలు పార్టీ జెండాను ఎగరేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చిన్నం రామారెడ్డి, తిక్‌రెడ్డి బాపిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. **పాలకోడేరు:** ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించాలని ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) అన్నారు. పాలకోడేరులో రాష్ట్రానికి జగనన్న ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని ఎంపిపి చంటిరాజు గురువారం ప్రారంభించారు. పాలకోడేరు సచివాలయం-1 పరిధిలోని ప్రజలకు అందిన సంక్షేమ పథకాలకు సంబంధించిన బోర్డును ఎంపిపి చంటిరాజు ఆవిష్కరించారు. స్థానిక పురాణ దిమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వైసిపి జెండాను మండల కన్వీనర్ కటిక శ్రీదేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎంపిపి చంటిరాజు మాట్లాడారు. వచ్చేది ఎన్నికల కాలం నేపథ్యంలో ప్రభుత్వం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. నియోజకవర్గంలో పివిఎల్ నరసింహరాజు పార్టీ అభివృద్ధి ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నాగేంద్రకుమార్, సర్పంచి ఇంజేటి మరియమ్మ లక్ష్మీపతి, ఉప సర్పంచి దెందుకూరి వెంకటరాజు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించామని ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. యాత్రికులు అమ్మవారికి కానుకలు, మొక్కుబడుల రూపంలో 49 రోజులుగా సమర్పించుకున్న రూ.10,62,704 సమకూరిందని తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమాన్ని భీమవరం దేవాలయాల ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో లెక్కించామన్నారు.

నిబంధనల మేరకు ఓటింగ్ యంత్రాల పరిశీలన

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

భీమవరం : ఓటింగ్ యంత్రాల మొదటి దశ తనిఖీలను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం కలెక్టరేట్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై జిల్లాకు కేటాయించిన ఇవిఎంలు ఫస్ట్ లెవెల్ పరిశీలన వివరాలను కలెక్టర్ వెల్లడించారు. 4,633 బ్యాలెట్ యూనిట్లు తనిఖీ చేయగా 4,593 పనిచేస్తున్నాయని, 40 పనిచేయడం లేదని తెలిపారు. 3,690 కంట్రోల్ యూనిట్లు తనిఖీలు చేయగా 3,663 పని చేస్తున్నాయని, 27 పనిచేయడం లేదన్నారు. 4,550 'వివి పాడ్‌లు తనిఖీ చేయగా 4,532 పని చేస్తున్నాయని, 18 పని చేయడంలేదని స్పష్టం చేశారు. పనిచేయని యంత్రాలను తిరిగి బెంగళూరుకు పంపిస్తామన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో పని చేయాలని, పారదర్శక ఓటరు జాబితా తయారీలో అందరూ భాగస్వామ్యం కావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కలెక్టర్ కోరారు. ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన స్పెషల్ క్యాంపెయిన్‌ను ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నరసింహారావు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నాదెండ్లకు పీపుల్స్ మేనిఫెస్టో అందజేత

పాలకొల్లు : మాజీ మంత్రి చేగొండి హరి రామ జోగయ్య ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలను జనసేన పిఎసి కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌కు అందించారు. జోగయ్య పీపుల్స్ మేనిఫెస్టో కమిటీ ఏర్పాటు చేసి ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలను టిడిపి - జనసేన మేనిఫెస్టోలో అధ్యయనం చేశారు. 20 మంది కమిటీ సభ్యులు 47 అంశాలతో ఇది రూపుదిద్దుకుంది. వీటిని జనసేన పిఎసి సభ్యులు చేగొండి సూర్యప్రకాష్ గురువారం విజయవాడలో మనోహర్‌కు అందజేశారు. మేనిఫెస్టోను పరిశీలించిన మనోహర్ కమిటీ సభ్యులను అభినందించారు. పవన్ కళ్యాణ్‌కు అందజేస్తామన్నారు.

బిసిలంతా ఐక్యంగా ఉండాలి

పాలకోడేరు: బిసిలంతా ఐక్యతతో ఉండాలని బిసి సంఘం జిల్లా అధ్యక్షులు సూరవరపు వెంకటాచార్యులు అన్నారు. వేండ్రలో సంఘం ఆత్మీయ సమావేశం మండల అధ్యక్షులు బొక్కా రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సంఘం జిల్లా అధ్యక్షులు సూరవరపు వెంకటాచార్యులు పాల్గొని ప్రసంగించారు. బిసిల అభ్యున్నతికి పాటుపడిన పార్టీనే ఎన్నుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నూతన కమిటీలోకి ఎన్నికైన సభ్యులకు నియామక పత్రాలను వెంకటాచార్యులు, నియోజక వర్గ బిసి సంఘం అధ్యక్షులు మన్నే నాగరాజు. సంఘం మండల అధ్యక్షులు బొక్కా రాంబాబు సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షురాలు కటిక శ్రీదేవి, నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో దానయ్య నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. న్యాయ స్థానం ముందు అందరూ సమానమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, ఉచిత న్యాయవాదులు దొంగ నరసింహరాజు, సిహెచ్ వెంకటేశ్వరరావు, నారిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తణుకురూరల్ : న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా గురువారం తణుకు కోర్టు ఆవరణలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్ పర్సన్, నాల్గో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సత్యవతి ఉచిత న్యాయ సహాయం, న్యాయ సేవల చట్టం, ప్రీలిటిగేషన్ కేసులు, లోక్ అదాలత్ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరాం పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం సందర్భంగా డిఎన్ఆర్ కళాశాల, మండల న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో లా విద్యార్థులకు లా కాలేజీ ప్రిన్సిపల్ కె.రఘురాం అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అధితిగా సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పలస్వామి పాల్గొని న్యాయ సేవాధికార సంస్థ ముఖ్యోద్దేశం అయిన లోక్ అదాలత్, ఉచిత న్యాయ సహాయం, న్యాయ విజ్ఞాన సదస్సులు వీటి ద్వారా కక్షిదారులకు కలిగే ఉపయోగాల గురించి వివరించారు. లా విద్యార్థులు వారి వారి గ్రామాలలో వీటి ప్రాధాన్యతను వివరించాలన్నారు. ప్రిన్సిపల్ కె.రఘురాం మాట్లాడుతూ కళాశాల తరపున గ్రామ స్థాయిలో చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజా రక్షణ భేరిని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అసమానతలు లేని అభివృద్ధి కోసం ఈ నెల 15న విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం గ్రామంలో స్థానిక భవనంలో సాయంకాలం నాలుగు గంటలకు అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ప్రజా ప్రణాళిక పోస్టర్‌ను స్కీం వర్కర్లు, ఆశాలు, అంగన్‌వాడీలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తున్నాయన్నారు. ఈనెల15న జరిగే ప్రజారక్షణ భేరిలో స్కీం వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చింది. అంగన్‌వాడీ నాయకులు కె.విజయలక్ష్మి, కె.ఝాన్సీ, సిహెచ్ చిట్టి మేరీ, సునీత పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులు క్రమశిక్షణతో మసులుకోవాలని, బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు తెలిపారు. నేషనల్ లీగల్ సర్వీస్ డే సందర్భంగా గురువారం ఆదిత్య జూనియర్ కాలేజీ వద్ద లీగల్ అవేర్నెస్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సూర్యకిరణ్ పాల్గొన్నారు.

16న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల16వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పి.పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో సర్వ సభ్యులంతా పాల్గొనాలని తెలిపారు. అదేవిధంగా మండల స్థాయి అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని పిలుపునిచ్చారు. లేని పక్షంలో తగిన సంజాయిషీ ఇవ్వాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం జాతీయ రహదారిపై గురువారం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వీరవాసరం పంట కాలువ నుంచి పాలకొల్లు వైపు వస్తున్న గ్రామానికి చెందిన అత్యం శశాంక్ మోటార్ సైకిల్‌పై వస్తుండగా భీమవరం వైపు వెళ్తున్న ఓ వాహనం ఢీకొట్టడంతో యువకుడి కాలు విరిగింది. స్థానికులు, బాధితులకు ప్రాథమిక చికిత్స చేసి 108 వాహనంలో భీమవరం ఆసుపత్రికి తీసుకెళ్లారు.

తాగునీటి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉండి

ఉనుదుర్రు గ్రామంలో జల జీవన్ మిషన్ పథకానికి డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు శంకుస్థాపన చేశారు. అనంతరం నరసింహరాజు మాట్లాడుతూ జల్ జీవన్ పథకం ద్వారా సుమారు 85 లక్షల రూపాయలతో పైప్‌లైన్ విస్తీరణ, మైక్రో ఫిల్టర్ పనులు గ్రామంలో ముందుకు సాగనున్నాయన్నారు. దీని ద్వారా తాగునీటి సమస్యలు తలెత్తవన్నారు. ఇది తాగునీరు శుద్ధి చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇంధుకూరి శ్రీహరి నారాయణ రాజు, గ్రామ సర్పంచి పిన్నమరాజు నాగలక్ష్మి పాల్గొన్నారు.

9న లోక్ అదాలత్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు రాజీ చేసుకోవాల్సిందిగా కోరారు. కక్షిదారులు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు.

దస్తావేజులు పోయినవి

నా క్లయింటు అయిన శ్రీమతి గుండపనేని వెంకట నాగ సత్యవతి, W/o. లక్ష్మీనారాయణ, డో.నెం. 1-14, ప్రకాశ్‌నగర్, బోగాపురం, పెదవేగి మండలం, ఏలూరు జిల్లా వారు ఇచ్చిన వివరములు ప్రకారము నా క్లయింటు మరియు ఆమె భర్త కలసి ది. 2-11-2023వ తేదీన కొప్పాక సొసైటీ బ్యాంకుకు వెళ్ళి మరల తిరిగి ఇంటికి ఆటోలో బయలుదేరి వెళ్తుండగా దారిలో బ్యాగ్ జారిపోయినది. దానిలో నా క్లయింటు పొలం తాలూకా R.S. No. 75 లో 0.70 సెంట్లుకు సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. ఆ ఒరిజినల్ దస్తావేజు ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది నా చిరునామాకు తెలియజేయవలసినదిగా కోరుచున్నాను.

శ్రీ వెలగపూడి వెంకటేశ్వరరావు
న్యాయవాది, శాంతినగర్, 11వ రోడ్డు
శ్రీ లక్ష్మీసాయి టవర్స్, ఫ్లాట్ నెంబర్: 203
ఏలూరు, ఏలూరు జిల్లా
సెల్: 9849669124

నరసాపురం పురపాలక సంఘము

నరసాపురం పురపాలక సంఘము నందు గడప గడపకు మన ప్రభుత్వం (GGMP) నిధులు & మునిసిపల్ సాధారణ నిధులతో వివిధ పనులు చేపట్టుటకు

ఇ-ప్రొక్యూరుమెంటు షార్టు టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం.393/2023-ఇ-1, తేది.09-11-2023

1. బిడ్ అమ్మకం ప్రారంభ తేది మరియు సమయం	:	10-11-2023 ఉ॥ గం॥ 11.30లకు
2. బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం	:	17-11-2023 సా॥ గం॥ 4.00లకు
3. ప్రైస్ బిడ్ తెరచు తేది మరియు సమయం	:	17-11-2023 సా॥ గం॥ 4.30లకు

ఇ-ప్రొక్యూరుమెంటు టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం.427/2022-ఇ-2, తేది.09-11-2023

1. బిడ్ అమ్మకం ప్రారంభ తేది మరియు సమయం	:	10-11-2023 ఉ॥ గం॥ 11.30లకు
2. బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం	:	27-11-2023 సా॥ గం॥ 4.00లకు
3. ప్రైస్ బిడ్ తెరచు తేది మరియు సమయం	:	27-11-2023 సా॥ గం॥ 4.30లకు

తదుపరి వివరాలను www.eprocurement.gov.in లోని 'e' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవచ్చును.

నరసాపురం పురపాలక సంఘం
నరసాపురం, ఫోన్ నెం. 08814273578

సం/- కమిషనరు
నరసాపురం మునిసిపాలిటీ

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ఉద్యోగ అవకాశం
ఆఫీసు అసిస్టెంట్
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత:
ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండాలి.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
యాడ్స్ డిజైనర్:
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత: ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తి చేసి,
తెలుగు, ఇంగ్లీషు టైపింగ్ వచ్చి పేజ్‌మేకర్/క్వార్క్ ఎక్స్‌ప్రెస్,
ఫోటోషాప్‌లలో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యత.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో బయోడేటాను మెయిల్ చేయండి
wgpraja@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు 94900 99177, 94900 99186

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814